క్లుప్తంగా

అన్నదానం
కడప కార్పొరేషన్: విజయదశమి సందర్భంగా చిన్నచౌకులోని హోండా షోరూం ఎదురుగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బీసీ నాయకుడు దాసరి సురేష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బరాయుడు, కొండాయపల్లె మధుసూదన్‌రావు, చంగల్ రాజు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు
కడప కార్పొరేషన్: విజయ దశమిని పురస్కరించుకొని చెన్నూరులో వెలసిన చౌడేశ్వరి దేవి అమ్మవారిని టీటీడీ బోర్డు సభ్యులు మాసీమ బాబు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాసీమను ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో 40వ డివిజన్ కార్పొరేటర్ బాలస్వామిరెడ్డి, మధువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

స్మశాన వాటిక తొలగింపు అన్యాయం
కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలోని యాకూబ్ సాహెబ్ మసీదు స్మశాన వాటిక స్థలాన్ని రోడ్డు విస్తరణ పేరుతో అక్రమంగా తొలగించడం అన్యాయమని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు వై. విష్ణు ప్రీతం రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

రక్తదాన శిబిరం
కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు దేవిరెడ్డి ఆదిత్య జన్మదిన వేడుకలు కడపలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాజారెడ్డి వీధిలో ఈ వేడుకలకు ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్ బాషా, మేయర్ సురేష్‌బాబులు ముఖ్య అతిథులుగా హాజరై ఆదిత్యతో కేక్ కట్ చేయించి కేకు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దేవిరెడ్డి ఆదిత్య యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని డిప్యూటీ సీఎం, మేయర్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వంశీనాథ్‌రెడ్డి, మియ్యా, కార్పొరేటర్లు కె. సూర్యనారాయణ రావు, షఫీ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ
కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో కడప నగర శివార్లలో సంస్థ శిక్షణాలయంలో బుధవారం నుంచి నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధి నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజులపాటు శిక్షణ కొనసాగుతుందని, శిక్షణాకాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారన్నారు. ఆసక్తిగల వారు 94409 05478 సంప్రదించాలని కోరారు.

కారుణ్య మాత వార్షికోత్సవం
కడప కల్చరల్ : స్థానిక పాలెంపల్లెలోని పునీత జోజప్ప గారి చర్చి ప్రాంగణంలోగల కారుణ్య మాత రెండవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మరియాపురం కెథడ్రల్ చర్చి డైరెక్టర్ ఫాదర్ బిరుసు రాజా ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక దివ్య బలిపూజ సమర్పించారు. అనంతరం పాలెంపల్లె మాజీ సర్పంచ్ మజ్జారి వెంకట సుబ్బ య్య, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు మజ్జారి వెంకట రమణలను ఫాదర్ బిరుసు రాజా, చర్చి ఉపదేశి జ్యోతి భాస్కర్ సన్మానించారు. కార్యక్రమంలో వివిధ విచారణలకు సంబంధించిన ప్రముఖులు జాన్ ప్రసాద్, మెల్ల ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

పేదలను స్వశక్తిపై నిలిపేందుకు కృషి

మాట్లాడుతున్న చిన్నపరెడ్డి

కడప కల్చరల్ : పేదలు, బడుగు వర్గాలను స్వశక్తిపై నిలిపేందుకు కృషి చేద్దామని లయన్ డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేటర్ కె.చిన్నపరెడ్డి అన్నారు. మంగళవారం కడప నగరంలోని లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య కార్యాలయంలో అ. ధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. క్లబ్ కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటై మూడు నెలలు గడిచిన సందర్భంగా వార్షిక నివేదికను అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన చిన్నపరెడ్డి మాట్లాడుతూ పేదలకు తాత్కాలిక సహాయాలు చేయడంతోపాటు వీలైనంత వరకు వారిని స్వశక్తిపై నిలిపేందుకు కుట్టు శిక్షణ, ఇతర వృత్తి విద్యలను నేర్పాలని సూచించారు. పోతుల , కొండూరు జనార్దన్‌రాజు, పూర్వ అధ్యక్షులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, క్లబ్ ఉపాధ్యక్షులు గౌరీశంకర్, గునిశెట్టి శ్రీనివాసులు మాట్లాడారు.

29న డాక్టర్ జానమద్ది పురస్కార ప్రదానం
కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ గ్రంథాలయ ప్రధాన వ్యవస్థాపకులు డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి 11వ సాహిత్య సేవా పురస్కార ప్రదానం ఈనెల 29వ తేదీన నిర్వహించనున్నామని జానమద్ది సాహితీపీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ తెలిపారు. తన తండ్రి పేరిట ఏర్పాటు చేసిన సాహిత్య సేవ పురస్కారాన్ని 2023 సంవత్సరానికిగాను ప్రముఖ రచయిత, ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు డాక్టర్ నాగసూరి వేణుగోపాల్‌కు అందజేయనున్నట్లు తెలిపారు.

దసరా ఉత్సవాలు కడప నగరంలో వైభవంగా నిర్వహించారు. ప్రతి రోజు ఒక అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పలు ఆలయాలలో నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విజయదశమి నేపథ్యంలో అమ్మవారి గ్రామోత్సవం కనులపండువగా నిర్వహించారు. కేరళ వాయిద్యకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.


శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కలెక్టర్ విజయరామరాజు


ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డికి ప్రసాదం అందిస్తున్న శ్రీ విజయ దుర్గాలయ నిర్వాహకులు


లక్ష్మీసత్యనారాయణస్వామి రథోత్సవంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా

అంగరంగ వైభవం

● కనుల పండువగా జగజ్జనని ఊరేగింపు ● తరలివచ్చిన భక్తజనం ● అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కడప కల్చరల్ : శరన్నవ రాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. విజయదశమిని పురస్కరించుకుని సోమవారం విశేష అలంకారాలలో ఉన్న అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. పూలు, రంగురంగుల విద్యుద్దీపాలతో ఆకర్షణీయంగా అలంకరించిన రథంపై అమ్మవారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి పూజలు చేశారు.

– నగరంలోని అన్ని ఆలయాల్లోనూ నిర్వాహకుల ఆధ్వర్యంలో అమ్మవారి ఊరేగింపు జరిగింది. పది రోజులపాటు పూజలందుకున్న అమ్మవారికి ఉత్సవాలలో చివరిఘట్టంగా నగరోత్సవం నిర్వహించారు. కళ్లు చెదిరే రంగుల రంగుల రకరకాల బాణాసంచా హడావుడి కనుల విందు చేసింది. విచిత్ర వేషధారులు అడుగడుగునా సరదా ఆటలతో ఆకర్షణీయంగా నిలిచారు. బ్యాండు మేళాల విన్యాసాలు కూడా ఆకట్టుకున్నాయి.

– కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి నగరోత్సవం, శ్రీ కన్యకా పరమేశ్వరిమాత ఊరేగింపు వైభవంగా సాగింది. హనుమప్పవీధి భద్రావతి భావనారుషి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు.

– దేవునికడపలో స్వామికి విశేష అలంకారం నిర్వహించి మాడవీధుల్లో ఊరేగించారు. చెన్నై రోడ్డులోని శ్రీ లలితాంబిక ఆలయ ప్రాంగణంలో అమ్మవారిని కనుల పండువగా అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గడ్డిబజారు శ్రీ లక్ష్మీసత్యనారాయణ స్వామి, శ్రీ కామకోటి కళాంబదేవి, సోమసుందరేశ్వరస్వామి, బాల పోలేరమ్మల ఊరేగింపు కూడా అంగరంగ వైభవంగా నిర్వహించారు. నడివీధి గంగమ్మ శమీ దర్శనం అనంతరం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. శ్వేత అశ్వాలు అమ్మవారు కొలువుదీరిన రథాన్ని లాగడం విశేషం.

జమ్మిదర్శనం
నవమి, దశమి ఒకేరోజున రావడంతో రెండు పండుగలు ఒకేరోజున నిర్వహించాల్సి వచ్చింది. సాయంత్రం మూడు గంటల నుంచి దాదాపు అన్ని అమ్మవారి ఆలయాల నుంచి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా శమీ దర్శనం కోసం జమ్మి చెట్టు వద్దకు తీసుకెళ్లారు. అమ్మవారిని జయజయ ధ్వానాల మధ్య అట్టహాసంగా తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. జమ్మి ఆకును సేకరించి ఒకరినొకరు బంగారం పేరిట దాన్ని అందజేసుకుని దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. విజయం సాధించాలని ఆకాంక్షించారు. రాత్రి ఆలయ నిర్వాహకులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆధ్వర్యంలో నగరోత్సవం తెల్లవారుజాము వరకు సాగింది. తొమ్మిది రోజులపాటు ఉత్సవాలకు సహకరించిన వారికి నిర్వాహకులు మంగళవారం అన్నదానం చేశారు.


కడప నగరంలో దసరా సందర్భంగా విజయదుర్గమ్మ ఆలయంలో భక్తుల సందడి


అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న కడప రాయుడు

అమ్మవారి సన్నిధిలో ప్రముఖులు
కడప కల్చరల్/ కడప కార్పొరేషన్: విజయదశమి ఉత్సవాల్లో భాగంగా పలువురు ప్రముఖులు, అధికారులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష గడ్డిబజారు శ్రీ లక్ష్మీసత్యనారాయణస్వామి నగరోత్సవంలో పాల్గొని తొలి పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, కలెక్టర్ విజయరామరాజులు శ్రీ విజయదుర్గాదేవి ఆలయాన్ని దర్శించుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్‌రావు వారికి స్వాగతం పలికి అమ్మవారిని దర్శింపజేశారు. అతిథులు అమ్మవారికి పూజలు నిర్వహించగా, అర్చకులు వేదాశీస్సులు, ప్రసాదాలు, శేష వస్త్రాలు, అమ్మవారి చిత్రపటం అందజేశారు.


అమ్మవారి గ్రామోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా కేరళ వాయిద్యకారుల సందడి

గాంధీజీ కలలు జగన్‌తో సాకారం

– ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : మహాత్మా గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రసూల్‌పల్లి గ్రామపంచాయతీలో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్బీకే కేంద్రం భవనాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఏపీ ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, సర్పంచ్ స్వాతి, నాయకులు నీలకంఠారెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉన్న ఊరిలోనే సౌకర్యాలు
వీరపునాయునిపల్లె : ప్రజలకు ఉన్న ఊరిలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సౌకర్యాలు కల్పిస్తున్నారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని గంగిరెడ్డిపల్లెలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య ఉప కేంద్రం, మినరల్ వాటర్ ప్లాంటు భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకొనే విధంగా ఉండేందుకు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారు తిరుపాల్‌రెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు, స్థానిక నాయకులు కిషోర్‌రెడ్డి, శ్రీనివాసుల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, చైతన్యకుమార్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, ప్రతాప్ యాదవ్, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ
కమలాపురం : బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. కమలాపురానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఓ.జాషువా పీటర్ ఈ నెల 11వ తేదీన గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం మృతుడి నివాసంలో జరిగిన సంతాప సభకు ఎమ్మెల్యే హాజరయ్యారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే జాషువా ఇద్దరు కుమార్తెలకు ఉద్యోగ అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


రసూల్‌పల్లెలో సచివాలయ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి

అమ్మవారిశాలలో అధికారులు
బద్వేలు అర్బన్ : బద్వేలులోని అమ్మవారిశాలవీధిలో గల వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయం (అమ్మవారిశాల)లో జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు, జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, కడప కార్పొరేషన్ కమిషనర్ సూర్యసాయిప్రవీణ్‌చంద్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆర్యవైశ్య వర్తక సంఘం తరఫున నిర్వాహకులు సత్కరించి, అమ్మవారి చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ గురుమోహన్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ, ఆర్యవైశ్య వర్తక సంఘం నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణం
గాలివీడు : మండల కేంద్రంలో వెలసిన శ్రీ లక్ష్మి వేంటరమణ స్వామి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మి వేంకటరమణ స్వామి కల్యాణోత్సవాన్ని ఆలయ నిర్వాహకులు తంగాల, కీ.శేలు వెంకట సిద్దయ్య, రెడ్డమ్మ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కడివెళ్ల రాంప్రసాద్ శర్మ పర్యవేక్షణలో జరిపారు. స్వామికి రూ. 2లక్షలు విలువ గల బంగారు ఆభరణాలను గాలివీడు ఉప సర్పంచ్ తంగాల వెంకటరత్నం బహూకరించారు. అనంతరం స్వామికి పట్టువస్త్రాలను స్థానికులు తమటం వెంకటరమణారెడ్డి కుటుంబ సభ్యులు సమర్పించారు. వచ్చిన భక్తులకు దాత శెట్టిపాపయ్య అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

దుస్తుల పంపిణీ
చింతకొమ్మదిన్నె : కడప నగర పరిధిలోని 17వ డివిజన్‌లో పారిశ్రామిక కార్మికులుగా పని చేస్తున్న సిబ్బందికి దసరా సందర్భంగా కార్పొరేటర్ చంద్రహాస్‌రెడ్డి సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి గుత్తిరెడ్డి లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

రాజంపేట రూరల్: మండల పరిధిలోని భువనగిరి పల్లి గ్రామ సమీపంలో సోమవారం దసరాను పురస్కరించుకొని కంభయ్యగారి నరసింహులు ఆధ్వర్యంలో వేడుకగా బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులను ఉత్తేజపరిచేందుకు బండలాగుడు పోటీలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఈ పోటీలలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఆకేపాటి మురళీరెడ్డి, చొప్పా యల్లారెడ్డి, నాగా పృథ్వీపతి రెడ్డి, జి.వెంకటసుబ్బారెడ్డి, డీలర్ సుబ్బరామిరెడ్డి, ఎంపీటీసీ నాగా శేఖర్‌రెడ్డి, స్థానిక నాయకులు ఎంఎల్ నారాయణ, ఎం.లక్ష్మినరసయ్య, కె.నరసింహా, కె.వెంకటరమణ, పూల హరిప్రసాద్, కె.సుబ్రమణ్యం, ఆలయ ధర్మకర్తలు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జునరెడ్డి తనయుడు మేడా కృష్ణతేజరెడ్డి పాల్గొన్నారు. కృష్ణతేజరెడ్డిని వైఎస్సార్ సీపీ పట్టణ యూత్ అధ్యక్షుడు సాయి రాజేష్, ప్రసన్నకుమార్, నవీన్‌లు ఘనంగా సత్కరించారు.


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

భక్తిశ్రద్ధలతో జ్యోతి ఉత్సవాలు

జమ్మలమడుగు : పట్టణంలోని నాగులకట్టలో వెలసిన చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలను తొగటవీర క్షత్రియులు వైభవంగా నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి అమ్మవారు చౌడేశ్వరిదేవి అలంకారంలో దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులు బిందే సేవ ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం మంగళవారం తెల్లవాము నుంచి అమ్మవారి జ్యోతులను తయారు చేసి పురవీధుల మీదుగా చౌడేశ్వరి దేవి కీర్తనలు పాడుతూ.. జ్యోతులను నెత్తి మీద పెట్టుకుని నృత్యాలు చేసుకుంటూ వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు.

– దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం చివరి రోజు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. ముఖ్యంగా పట్టణంలో ప్రముఖ ఆలయాలైన అంబాభవానీ, కన్యకాపరమేశ్వరిదేవి, నాగులకట్టలోని చౌడేశ్వరిదేవి, సాయిబాబా ఆలయంలో ఉన్న శ్రీరాజరాజేశ్వరిదేవి, ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న లక్ష్మీప్రసన్న వెంకటేశ్వర ఆలయాలకు భక్తుల తాకిడి ఎక్కువగా కనిపించింది.

– ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, గిరిధర్‌రెడ్డి, శివారెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి, హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ విజయలక్ష్మీ, మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ దర్శించుకున్నారు.

బ్ర.మఠంలో విశేష పూజలు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శమీపూజోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామిమఠంలో మాతా గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామికి విశేష పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తుల ఊరేగింపు చేపట్టారు. జగన్మాత శ్రీ ఈశ్వరీదేవి మఠంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఊరేగింపు ప్రారంభించారు. ఈ ఊరేగింపులో మాతా గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి, వారి మనువరాలు శ్రీ ఈశ్వరీదేవిని భక్తులు ఏక కాలంలో దర్శించుకుని ఆనందపరవశులయ్యారు. ఉత్సవ మూర్తులను జమ్మివృక్షం దగ్గరికి తీసుకెళ్లి, ప్రదక్షిణలు చేయించారు. అనంతరం ఆలయాలకు తీసుకొచ్చారు. రాత్రి కలశోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో పెద్దమఠం పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వర స్వామి కుటుంబ సభ్యులు, చిన్నమఠం మఠాధిపతి శ్రీ వీరశివకుమారస్వామి, ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే అమ్మవారిశాలలో విజయదశమి వేడుకలు, శమీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు.

బండలాగుడు పోటీలు
దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం కోడూరు దుర్గాదేవి ఆలయంలో నిర్వాహకులు బండలాగుడు పోటీలను నిర్వహించారు.

పెద్దదర్గాలో ముస్లిం ఐక్యవేదిక సభ్యులు
కడప కల్చరల్ : ముస్లిం ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ సభ్యులు మంగళవారం అమీన్‌పీర్ (పెద్ద)దర్గాను దర్శించుకున్నారు. దర్గా ముజావర్ అమీర్ వారికి స్వాగతం పలికి ప్రధాన గురువుల మజార్ వద్ద అనంతరం, ఆ ప్రాంగణంలోని ఇతర గురువుల మజార్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. ఫాతెహా నిర్వహించి ప్రసాదాన్ని అందజేశారు. ఐక్యవేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్, జియావుల్ రెహ్మాన్, జాఫర్ వలీ, సయ్యద్ ఖలీల్, నూర్, గుంటూరు సలావుద్దీన్, కలాం, జావిద్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఏకలవ్య సేవలు విస్తృత పరచాలి
కడప ఎడ్యుకేషన్: ఏకలవ్య ఫౌండేషన్ సేవలు, కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేయాలని, గ్రామీణ ప్రాంత విద్యార్థులలో నైపుణ్యం వెలికితీసే విధంగా ఉండాలని ఫౌండేషన్ గౌరవ సలహాదారు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం కడప మారుతీనగర్‌లోని ఏకలవ్య ఫౌండేషన్ కార్యాలయంలో జిల్లాస్థాయి విద్యా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక, ఉన్నత పాఠశాలలలో అమలు జరిపిన నెలవారి విద్యా కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించడంతోపాటు భవిష్యత్తు కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. ట్రస్టీ ప్రతినిధి చలపతి, విద్యా కమిటీ చైర్మన్ బాలకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశీలకుడు సతీష్, జిల్లా విద్యా సమన్వయ కర్తలు నరేష్, బాలాజీ, కమిటి సభ్యులు బాలాజీ, నరసింహులు, జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ
కడప ఎడ్యుకేషన్: జేకే వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అమ్మవారి భక్తులకు నీళ్లు, మజ్జిగ, సమోసాలను పంపిణీ చేశారు. విజయదశమి పురస్కరించుకుని అమ్మవారి ఊరేగింపు సందర్భంగా భక్తులకు జేకే జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు లయన్ పఠాన్ ఖాదర్‌బాష ఆధ్వర్యంలో సేవలు అందచేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రఫీ, సుబ్బరాయుడు, ఖదీర్, సలీం తదితరులు పాల్గొన్నారు.

పార్కులో సందర్శకుల సందడి


కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలోని 45వ డివిజన్ పరిధిలోని చెమ్ముమియ్యాపేటలోని భగత్‌సింగ్ పార్క్ మంగళవారం సందర్శకుల తాకిడితో కిటకిట లాడింది. దసరా పండుగ కావడంతో పాటు విద్యార్థులకు సెలవులు కావడంతో ప్రజలు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి పార్కులో బంధుమిత్రులతో సరదాగా గడిపారు. పార్క్‌లో ఏర్పాటు చేసిన ఆట వస్తువులతో చిన్నారులు ఆడుకుంటూ సందడి చేశారు.

శిల్పారామంలో ..
కడప కల్చరల్ : దసరా పండుగను పురస్కరించుకుని శిల్పారామంలో దసరా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం చిత్తూరు బైరెడ్డిపల్లెకు చెందిన కళాతరింగిణి బృందం సభ్యులు దసరా పండుగ విశిష్టతలను తెలిపే పలు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు.

ప్రయాణికులతో రైళ్లు కిటకిట


కడప కోటిరెడ్డిసర్కిల్ : దసరా పండుగ ముగిసిన తరుణంలో వివిధ ప్రాంతాలకు వెళుతున్న ప్రయాణికులతో రైళ్లు కిటకిటలాడుతున్నాయి. రైల్వేశాఖ ప్రయాణికులకు తగినట్లుగా స్పెషల్ రైళ్లను నడపకపోవడంతో ఉన్న వాటిలోనే ప్రయాణికులు కిక్కిరిసి ప్రయాణిస్తున్నారు. ముఖ్యంగా దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు రైలు ప్రయాణానికి మొగ్గుచూపుతున్నారు. రైల్వే అధికారులు కనీసం ఉన్న రైళ్లకు బోగీలను సైతం పెంచకపోవడంతో ప్రయాణికుల కష్టాలు మరింత పెరిగాయి. రైళ్లలో చిన్నారులు, మహిళలు, వృద్ధులు కూర్చొనేందుకు వీలు లేక ఇక్కట్లు పడుతున్నారు.

పగిలిన పైపులైన్

వరదకాలనీలో పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి వృథా అవుతున్న నీరు

కడప కార్పొరేషన్: కడప నగరం రామాంజనేయపురం పరిధిలోని వరదకాలనీ సెంటర్‌లో పైపులైన్ దెబ్బతింది. ఫలితంగా తాగునీరు వృథాగా రోడ్డుపై పారుతోంది. సుమారు నెలరోజులవుతున్నా ఎవరూ ఈ లీకేజీని పట్టించుకోకపోవడంతో రోడ్డు అంతా బురదమయంగా మారింది. స్థానిక ప్రజలు ఈ బురదలో రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి లీకేజీని అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

మధురై ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు
కడప కోటిరెడ్డి సర్కిల్ : మధురై–ఓఖా మధ్య నడుస్తున్న మధురై ఎక్స్‌ప్రెస్ (09519)ను దారి మళ్లించినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల ఈనెల 27వ తేదీ నుంచి ఈ రైలును దారి మళ్లించారన్నారు. ఈ రైలు రేణిగుంట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి మీదుగా నడవాల్సి ఉండగా.. కాట్పాడి, పాకాల, ధర్మవరం, గుత్తి మీదుగా ఓఖాకు నడుస్తుందన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు.